
ఎల్‌బీనగర్‌లోని బస్టాప్ వద్ద మహిళలకు ప్రయాణం ఉచితమని అనౌన్స్‌మెంట్ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగి

'మహాలక్ష్మి'.. మహదానందం!

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ స్కీమ్ ప్రారంభం
- బస్సుల్లో ప్రయాణించేందుకు అధిక సంఖ్యలో వస్తున్న మహిళలు
- పథకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు
- ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు

మన్సూరాబాద్: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ (మహాలక్ష్మి) పథకాన్ని ప్రారంభించడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 1.30కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాలక్ష్మి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించగా, 2 గంటల నుంచే ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ఆర్టీసీ బస్సులు ఎక్కే మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. తెలంగాణలోని దూరప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణికులకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం ఉచితం కావడంతో మహిళలతో బస్సులు నిండిపోతున్నాయి. మహాలక్ష్మి పథకంపై మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మైక్ అనౌన్స్‌మెంట్‌తో పాటు మహిళాఉద్యోగులు ప్రయాణికులకు అవగాహన కలిప్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.


మహిళా ప్రయాణికులతో బస్సు నిండిపోవడంతో బస్సు బాయినెట్‌పై కూర్చుని ప్రయాణిస్తున్న మహిళ


ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బస్సుల కోసం ఎదురుచూస్తున్న మహిళా ప్రయాణికులు


బస్టాప్ వద్ద.. మహిళలకు మహాలక్ష్మి పథకంపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది


మహిళా ప్రయాణికులతో నిండిపోయిన ఆర్టీసీ బస్సు


ఎల్‌బీనగర్‌లోని దూర ప్రాంత బస్టాప్ వద్ద పోలీసుల బందోబస్తు

అవగాహన కల్పించడం సంతోషకరం



ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితమని మహిళా ప్రయాణికులకు ఉద్యోగులు అవగాహన కల్పించడం ఎంతో సంతోషకరం. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులోని బస్సు స్టాప్ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయి. వృద్ధురాలిని అని నన్ను ఉద్యోగులే బస్సు ఎక్కించడం ఎంతో ఆనందంగా ఉంది.

– భారతమ్మ, నల్లగొండ

అన్ని బస్సుల్లోను వర్తింపజేయాలి



ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే కాకుండా ఆర్టీసీ అన్ని బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలి. ప్రయాణం ఉచితం కావడంతో బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య పెరుగుతుంది. అందుకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా బస్సులను నడపాలి.

–ధనలక్ష్మి, సూర్యాపేట

ప్రభుత్వానికి ధన్యవాదాలు



మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న నూతన ప్రభుత్వానికి ధన్యవాదాలు. మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. ప్రయాణం ఉచితమని మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించడం సంతోషకరం.

– కార్తీక, కోదాడ

గ్యారంటీల అమలు ఆనందదాయకం



అధికార పగ్గాలు చేపట్టిన రెండు రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం ఎంతోఆనందదాయకం. మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే కాకుండా ఆర్టీసీ అన్ని బస్సుల్లోను వర్తింప చేయాలని కోరుతున్నా.

–మంజుల, నార్కట్‌పల్లి

ఉచిత ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగకరం


హయత్‌నగర్‌లో ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు,డీఎం విజయ్ తదితరులు

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పేరిట ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం పేద మహిళలకు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని హయత్‌నగర్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, హయత్‌నగర్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ జలగం విజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని శనివారం వారు హయత్‌నగర్ బస్ స్టేషన్‌లో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా పేదలకు ఆర్థిక చేయూత లభిస్తుందని, విద్యార్థులకు, ప్రైవేట్ ఉద్యోగాలు చేసే మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. బస్సులో ప్రయాణికులకు తమ సిబ్బంది తగిన మర్యాద ఇస్తారని, ప్రతి ఒక్కరూ వారికి సహకరించాలని కోరారు. త్వరలోనే ప్రయాణికులకు స్మార్ట్ కార్డులు అందిస్తామని, అప్పటి వరకు మహిళలు తగిన గుర్తింపు కార్డులను తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రికి విశ్వకర్మ మహాసభ విజ్ఞప్తి


మాట్లాడుతున్న విశ్వకర్మ మహాసభ అధ్యక్షుడు కొలే జగన్నాథం తదితరులు

ఎల్‌బీనగర్: ప్రగతి భవన్‌కు జ్యోతిరావ్ పూలే ప్రజా భవన్‌గా నామకరణం చేయడం హర్షించదగ్గ విషయమని అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొలే జగన్నాథం అన్నారు. శనివారం బీఎన్‌రెడ్డి నగర్‌లోని సాగర్ కాంప్లెక్స్‌లో మహాసభ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు విశ్వకర్మలను విస్మరించాయని, ఈ ప్రభుత్వంలోనైనా విశ్వకర్మలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.200 కోట్లు కేటాయించాలని కోరారు. పేద విశ్వకర్మలకు, వృద్ధులకు ఈ కార్పొరేషన్ ద్వారా నెలకు రూ.7000 పెన్షన్ మంజూరు చేయాలని, ఇల్లు లేని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విశ్వకర్మల సమస్యలపై ఒక వినతి పత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో విశ్వకర్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి, కోశాధికారి ఆవంచ మురళి, అధికార ప్రతినిధి సతీష్‌చారి నాయకులు భాస్కరాచారి, కాసోజు శ్రీనివాస్, పట్నాల సావిత్రి, ఆర్వీ లక్ష్మి, అరుణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల అమలు అభినందనీయం

హుడాకాంప్లెక్స్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డిని శనివారం సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆకుల అరవింద్‌కుమార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆరు గ్యారంటీలలో రెండింటినీ అమలు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన మల్‌రెడ్డికి త్వరలోనే మంత్రి పదవి రావాలని ఆకాంక్షించారు. వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని పూజలు

మీర్‌పేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిల్లెలగూడలోని కట్టమైసమ్మ ఆలయంలో స్థానిక నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. పూజల్లో ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌరీశంకర్, బాలమణి, నాయకులు దీప్‌లాల్‌చౌహాన్, ప్రభాకర్‌రెడ్డి, దయానంద్ ముదిరాజ్, గోపీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో..

మహేశ్వరం: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశానుసారం బీఆర్ఎస్ నాయకులు మహేశ్వరం శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సేవలందించాలని భగవంతుని వేడుకున్నట్లు ఆలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్ తెలిపారు. నాయకులు ఆనందం, అదిల్, ప్రభాకర్, నవీన్, కృష్ణ, వీరు బాబు, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సాధికారత


బస్సులో ప్రయాణిస్తున్న ఆర్‌కేపురం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి

దిల్‌సుఖ్‌నగర్: మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం మహిళల కోసం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 6 గ్యారంటీ హామీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సోనియా గాంధీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేణుక, కోటేశ్వరి, సంతోషిని, రామ, అరుణ, మాధవి, లక్ష్మీబాయి, శ్వేత, మమత, లావణ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

రాజనర్సింహకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్

నాగోలు: కాంగ్రెస్ ముఖ్యనేత, రాష్ట్రమంత్రి దామోదర రాజనర్సింహకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారపాక సురేందర్, డాక్టర్ పరశురాములు కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.శనివారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజనర్సింహ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దలకు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత, లాభనష్టాలను వివరించి ప్రత్యేక రాష్ట్రం సాధించడంలో ముందంజలో నిలిచారన్నారు. సమైక్య ఆంధ్ర రాష్ట్రంలో ఉపముఖ్యమంత్రిగా పని చేసిన ఆయనకు స్వరాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునర్ ఆలోచించి మాదిగలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజనర్సింహకు వెంటనే ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ జంపాల రాజేష్, కాచిగూడ సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపుపై నిర్లక్ష్యం

- డంపింగ్ యార్డులుగా మారుతున్న కాలనీ రోడ్లు
- దుర్వాసనతో కాలనీవాసులు, వాహనదారుల ఇక్కట్లు

ఎల్‌బీనగర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీలు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా కాలనీల ప్రజలతో పాటు వాహనదారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. రోజు వారీగా చెత్తను తరలించకపోవడంతో సాహెబ్‌నగర్ శ్మశానవాటిక వద్ద రోడ్డు చెత్త డంపింగ్ యార్డుగా మారింది. అధికారులు వివిధ కాలనీల నుంచి రోజూ డంపింగ్ చేస్తున్న చెత్తను అక్కడ నుంచి తొలగించకపోవడంతో ప్రజలు అటు వైపు వెళ్లలేక పోతున్నారు. చెత్త నుంచి వస్తున్న కంపుతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

కాలనీనా.. చెత్త డంపింగ్ యార్డా?

ప్రతి రోజూ రోడ్లు ఊడ్చగా వచ్చిన చెత్తతోపాటు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ పాయింట్ వద్ద చెత్తను చేర్చాలి. అక్కడ నుంచి భారీ వాహనాల్లో వేరే ప్రాంతానికి తరలిస్తారు. కానీ ఇక్కడ ఏకంగా కాలనీలోకి వెళ్లే రహదారి పక్కనే చెత్త డంపింగ్ యార్డుగా మార్చారు. ఈ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పరిసర ఇళ్ల యజమానులతో పాటు కాలనీలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను రోజు వారీగా తరలించాలని పలువురు కోరుతున్నారు.


సాహెబ్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలోని రోడ్డు పక్కన పేరుకుపోయి చెత్త

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు


కొత్తపేటలో పారిశుద్ధ కార్మికులకు చీరలు అందజేస్తున్న వజీర్ ప్రకాష్‌గౌడ్


ఆర్‌కేపురంలో కేక్ కట్ చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు


దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ బృందం: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, తెలంగాణ రాష్ట్ర ప్రధాత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేకులు కట్ చేసి పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు.

- కొత్తపేట డివిజన్ మహిళా భవనంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళలకు, పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు లింగాల కిషోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- నాగోలు డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెర్కు చిరంజీవిగౌడ్ ఆధ్వర్యంలో.. నాగోలులోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.
- రామకృష్ణా పురం చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని కేక్‌కట్ చేశారు.
- దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్‌లో చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు.
- బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మకుటం సదాశివుడు ఆధ్వర్యంలో శాంతినికేతన్ మానసిక వికలాంగుల అనాథాశ్రమంలో పండ్లు పంపిణీతో పాటు అన్నదానం చేశారు.
- వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. మహిళా అధ్యక్షురాలు స్వర్ణమాధవి పాల్గొన్నారు.
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సలీంనగర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు.
- సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించారు. అనంతరం కామినేని చౌరస్తాలో కేక్‌ను కట్ చేశారు.
- చంపాపేటలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. సీనియర్ నాయకుడు గోపాల్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న సత్యంచారి, శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం శాసన సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం క్యాంపు కార్యాలయంలో ఆయనను హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యంచారి ఆధ్వర్యంలో కార్యకర్తలు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని వరద ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కోట్లాది రూపాయలతో బాక్స్ డ్రెయిన్లు నిర్మించి సమస్యను పరిష్కరించామన్నారు. భవిష్యత్‌లో సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో ఎంతో మేలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యశిబిరాల వల్ల ప్రజలకు వచ్చే వ్యాధులపై అవగాహన కలుగుతుందన్నారు. కామినేని ఆసుపత్రి వారు తరచూ కాలనీలో శిబిరాను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, జైపాల్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, రవి శంకర్, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, కామినేని ఆసుపత్రి డాక్టర్లు కార్తీక్, వంశీ, స్టెల్లా, లక్ష్మీప్రియ తదితరులు పాల్గొన్నారు.

జక్కిడికి పరామర్శ


జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మధుయాష్కీ గౌడ్

మన్సూరాబాద్: ప్రమాదవశాత్తు గాయపడి కుడిచేతికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పోదర్‌లో స్పోర్ట్స్ డే



హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని పోదర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ప్రతిక్ష జోహ్రి ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీ నగర్ కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డి, హయత్‌నగర్ ఏ బ్లాక్ ప్రెసిడెంట్ గుర్రం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెడ్ మిసెస్ బాలప్రసన్న ,టీచర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కుమ్మర్ల కార్తీక వనభోజనాలు


పాల్గొన్న కుమ్మర, శాలివాహన సంఘం నేతలు

మన్సూరాబాద్: కుమ్మర, శాలివాహన సంక్షేమ సంఘం ఈస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాలు మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి మాట్లాడుతూ, కుమ్మర్లు ఐకమత్యంతో ఉంటే ప్రభుత్వ సాయం అందడంతో పాటు రాజకీయంగా పదవులు దక్కే అవకాశముందన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నారాయణ, కోశాధికారి అంజయ్య, సలహాదారు వీరయ్య, ఉపేందర్, మల్లేష్, చంద్రశేఖర్, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- లార్డ్స్ పాఠశాలలో హరితహారం

మీర్‌పేట: ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించుకోవాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్, కార్పొరేటర్ సిద్దాల బీరప్ప కోరారు. శనివారం జిల్లెలగూడ లార్డ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, కళాశాల సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్ల ప్రాముఖ్యత, మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 'చేయి చేయి కలుపుదాం.. చెట్లను నాటుదాం.. భావితరానికి స్వచ్ఛమైన గాలి, పచ్చదనాన్ని అందించాలని' విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీన్ సతీష్‌కుమార్, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, ప్రిన్సిపాల్ సరిత పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మలక్‌పేట: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గుర్తు తెలియని ఓ వ్యక్తి (55–60) భిక్షాటన చేస్తూ మూసారంబాగ్ మెట్రోస్టేషన్ పిల్లర్ నం. 1481 వద్ద నిద్రిస్తున్నాడు. మెట్రోస్టేషన్‌లో కంట్రోలర్‌గా పని చేస్తున్న పీ అండ్ టీ కాలనీ వాసి శ్రీరామ్‌కుమార్ ప్రతి రోజూ యాచకుడిని గమనిస్తున్నాడు. శనివారం ఉదయం 10 గంటలకు ఆ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన అతను 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. అతడిని పరిశీలించిన అంబులెన్స్ సిబ్బంది అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రామ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి ఎస్సై సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. యాచకుడు అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.